# అద్వైతం

"గూటానికి కట్టిపెట్టిన గొడ్డులా ఎంతకాలమైనా నీ ఊరికి నువ్వు అంటిపెట్టుకుంటే ఎలాగయ్యా శేఖరం! నాలుగు ప్రాంతాలు చూడాలి. నాలుగు రకాల మనుషుల్ని కలుసుకోవాలి. నాలుగు విషయాలు తెలుసుకోవాలి. అప్పుడేనయ్యా భూమిపైన పుట్టినందుకు మనిషి పుట్టుక సార్థకమయ్యేది! ఇంతకూ దీనికోసం నువ్వేమైనా నూర్లూ, వేలూ వెచ్చించబోతున్నావా? బోడిపాతిక రూపాయలే గదా! రెండు రోజుల టూరు. రథం కదిలేది సరిగ్గా ఎనిమిదిన్నరకు, నువ్వు ఎనిమిదికల్లా జూనియర్ కాలేజి ముందరుండాలి. పదకొండుకు పోళూరు. రెండున్నరకు పన్‌రొట్టి. భళ్లున తెల్లారేటప్పటికి తిరునెల్లార్. అక్కడ స్నానం, శనేశ్వర దర్శనం, తొమ్మిదింటికి కారైక్కాల్‌లో టిఫిను, పదిన్నరకు వేలాంగణ్ణి. పన్నెండయ్యేసరికి నాగపట్నం. అక్కడే భోజనం కాసేపు విశ్రాంతి తీసుకున్నాక నెక్స్ హాల్టు నాగూరు. అక్కడనుంచి అయిదుగంటలకు పూంబుహార్. పొద్దుపోయేటప్పుడు పూంబుహార్‌లో బయల్దేరితే ఎనిమిదికల్లా వైదీశ్వరన్ కోయిల్, పదింటికి చిదంబరం; రాత్రి అక్కడే హాల్టు. తెల్లవారగానే చిదంబర రహస్యం తెలుసుకోడమేమో, నాష్టా చెయ్యడమేమో, బస్సెక్కడమేమో – పదిగంటలకు పడలూరు. పన్నెండుకు నైవేలీ. లిగ్నైటు ఫ్యాక్టరీలు. తవ్వకాలు చూచుకున్నాక ఇక నేరుగా తిరువణామలైగుండా శాతనూర్ డామ్. పొద్దు పోయి చీకటి పడ్డాక వెలిగిన దీపాల్లో డామ్‌సైట్ చూచుకున్నాక రిటర్న్ జర్నీ టు తిరువణ్ణామలై. పది గంటలకులోగా అరుణాచలేశ్వరుణ్ణి దర్శించడం. అప్పుడింక భోజనం చేసి కూచుంటా మేమో, ఆఘమేఘాలపైన తిరుగు ప్రయాణం. తెల్లవారు జామున నాలుగు గంటలకు నువ్వెక్కడైతే బస్సెక్కావో ఆ గాంధి విగ్రహం ఎదుట నిన్ను సురక్షితంగా దించేసే పూచీ నాది... నువ్వే కాదులే, ఇంకా నీలాంటి పాసెంజర్లు నలభై తొమ్మిదిమంది ఉన్నారు. రెడీగా ఉండు. శుక్రవారం రాత్రికే ప్రయాణం" అంటూ ఉత్తరం వ్రాసి నన్ను యాత్రకు సిద్ధపరచిన వాడు నా బాల్యమిత్రుడు జయరాం.

బాల్య స్నేహితుడైనందుకు అతడేర్పాటు చేసిన అదనపు సదుపాయం – నన్ను తీసుకెళ్ళి పొదుగాటి సీట్లో డ్రయివరు కెదురుగా కూచోబెట్టడం! అటువైపు నుంచీ చూస్తే నాదే మొదటి సీటనుకోండి. అమ్మో! ఎంత పెద్ద గాజు పలక! బహుశా ఏ టెలివిజన్ సెట్టూ ఇంత పెద్దదిగా ఉండదేమో! కొండలూ, కోనలూ గనుక పర్మిట్ చేస్తే ఎంచక్కా దిగంతాలదాకా చూస్తూ కూచోవచ్చు.

ఫ్రంట్ సీటు కలిగించిన తన్మయత్వంలోనుంచీ తేరుకుని ఈవలికి చూచేసరికి సూట్‌కేసులు, గాలి దిండ్లు, పేముబుట్టలు, ప్లాస్టిక్ సంచులు, టిఫిన్ డబ్బాలు, నీళ్ళకూజాలు మొదలైన సామాన్లతో బస్సు బస్సంతా పెళ్ళివారి విడిదిలా తయారైపోయి ఉంది. అంతమందిలోనూ నాకు పరిచితమైన ముఖాల సంఖ్య తక్కువే! హిందీ లెక్చరర్

మోహనరావు, ఆయన భార్య రమాదేవి, మరదలు కస్తూరి, ఆమె భర్త కృష్ణమూర్తి, లైబ్రేరియన్ చెన్నకేశవులు, అతడి భార్య హంసవేణి, మునిసిపల్ స్కూల్‌లో పనిచేసే పంతులమ్మ రోజా మేరీ, ఆమె భర్త కృపానందం, ఆడపిల్లల స్కూల్‌లో సంగీతం మేష్టారు మహాలింగం - ఇంత మాత్రమే నాకు పరిచితుల క్రింద జమ! ప్రయాణీకుల్ని గ్రూపుల కింద వర్గీకరించి సీట్లలో సర్దేపనిలో నిమగ్నుడై వున్నాడు జయరాం. నలుగురు కూర్చునే సీట్లను అతడు వీలయినంతవరకూ జంటలకోసం ప్రత్యేకించాడు. పెళ్ళికాని యువకులకు, కుర్రవాళ్ళకు పొడుగాటి సీటును కేటాయించాడు. వెనుకవైపున కూచున్న ముస్లిం కుటుంబంతో ప్రస్తుతానికి అతడేదో పేచీ పడుతున్నట్టు తోచింది. 'ఎండాకాలానికి తోడుగా ఈ బురఖా ఒకటి కూడానా, బూబమ్మ గారూ! హాయిగా తీసేయ గూడదటండీ?' అంటున్నాడు జయరాం. "బాబ్బాబూ! నాకైనా ఇది చీదరగానే ఉంది. వూరు దాటంగానే తీసేస్తాను" అంటూ బూబమ్మ తాళజెప్పుతూ ఉంది.

బియ్యే స్టూడెంటు ఒకతను బస్సు వూరు దాటుకోగానే తన వెంట తెచ్చుకున్న ట్రాన్సిస్టరును 'ఆన్' చేయడం కోసమని కాచుకొని కూచున్నాడు. బస్సు వూరు దాటంగానే బూబమ్మ ముసుగు తీసేస్తాననంటూంది. వూరు దాటే దాకా బస్సులో గాలికూడా కదిలేటట్టు లేదు. మనిషి స్వేచ్ఛకూ, చొరవకూ, సుఖానికి ఈ నగరమూ, నాగరికతా కూడా ఇంతటి ప్రతి బంధకాలుగా ఉన్నాయా అనిపించి నేనాశ్చర్యపడకుండా ఉండలేకపోయాను.

వరసగా అందరికి సలహాలిస్తూ, చివరకు నా దగ్గర కొచ్చేశాడు జయరాం - "అయ్యా, శేఖరం! ఏ భోగానికి తగిన శిక్ష ఆ భోగానికుంటుంది. ఫ్రంటు సీటులో కూచున్నందుకు శిక్షేమిటో తెలుసా? కంటిపైన రెప్ప వేయకుండా ఉండడం. కునుకు తీశావో, నిద్రాదేవి డ్రయివరుకు సోకుతుంది. ఏం - తెలిసిందా?" అంటూ నన్ను హెచ్చరించి అతడు డ్రయివరు వైపు తిరిగాడు "బ్రదర్, గంగూలీ! ఈయనేమో నాకు చాలా మిత్రుడు. దీన్ని గురించి మనకెందుకులే అని వూర్కోడు. అదేమిటిదేమిటని అడుగుతూ చిరాకు కలిగించినా కలిగిస్తాడు. ఓపిగ్గా ఎక్స్‌ప్లెయిన్ చెయ్యాలి. ప్లీస్, ఇది నా ఆబ్లిగేషన్..."

బస్సు వెంట జయరాం రావడం లేదని నాకప్పుడుగానీ తెలిసి వచ్చింది గాదు.

"అదేమిటయ్యా, మహానుభావా, నువ్వు గైడ్‌గా ఉంటావనే గదా నేనీ టూరుకు సిద్ధం గావడం?" అంటూ అతడివైపు తెల్లబోయి చూచాను.

"చూడు శేఖరం, అర్జంటుపని ఒకటి తగలడం వల్ల నేనాగిపోవలసి వచ్చింది. పరవాలేదు. గంగూలీ సాబ్‌కు దక్షిణదేశ యాత్రలన్నీ కొట్టినపిండి. ఎక్కడెక్కడ ఏయే సదుపాయాలూ చూచి పెట్టాలో క్షుణ్ణంగా తెలుసు. నీకే సందేహమొచ్చినా నెమ్మదిగా వివరణ చేసే ఓపికగూడా ఉంది. చాలా నిదానస్తుడులే? పదునువాన పైన బడ్డా పదరడు..."

టూరు నిర్వాహకుడికి తనపైన ఉన్న సదభిప్రాయానికి మురిసిపోతున్నట్టుగా, బొద్దుగా ప్రారంభమై కొసల్లో వాడిదేలిన తన నల్లటి మీసాలను హేలగా సవరించుకుంటూ "హచ్చా, హచ్ఛా, జైరాంజీ! సెలవైతే బండి కదిలిస్తా" అన్నాడు గంగూలీ.

ఆనందోత్సాహాల మధ్య బస్సు కదిలింది. పదిహేను నిముషాల్లో నగరం శివార్లలోకి వచ్చేసింది. గురిపెట్టి వదిలిన బాణంలా రోడ్డు వెంట దూసుకు పోతూంది.

పట్నంలో ఉన్నంతవరకు అదొక వెన్నెల రాత్రి అన్న స్పృహయినా లేకపోయింది నాకు. ఊరు దాటంగానే పుచ్చ పువ్వులాంటి వెన్నెల కాస్తున్నట్టు తెలిసింది. వెన్నెల సంద్రంలో లోకమంతా ఒక పూల తెప్పయితే, చల్లటి గాలే దాని తెరచాప. భలే నవ్వొచ్చింది నాకు. కడుపునిండా తిన్నప్పుడు నిద్రొచ్చినట్టుగా, కమనీయమైన ప్రకృతి దృశ్యాన్ని చూచినప్పుడు కవిత్వం పుట్టుకొస్తుందేమో!

ఈలోగా బియ్యే స్టూడెంటు తన ట్రాన్సిస్టరు పైన ప్రయోగాలు ప్రారంభించేశాడు. "ఏ ఊరని నను వివరమడిగితే ఏమని తెలుపుదు లోకులకు" అంటూ ఒక కాలజ్ఞానతత్త్వం వినిపించీ 'ఇది కడప' అన్నాడు. ఆంధ్రులెవరు – అనే అంశంపైన వస్తున్న ప్రసంగాన్ని వినిపించి 'ఇది విజయవాడ' అన్నాడు. ఎడింబరో విశ్వవిద్యాలయంలో ద్రావిడ భాషలపైన జరిగిన పరిశోధనను గురించి ఒక పాశ్చాత్య విద్వాంసుడితో జరిగిన ఇంటర్వ్యూను వినిపించి 'ఇది హైదరాబాద్' అన్నాడు. ఎల్లలోకము లొక్క ఇల్లై జాతిభేదము లెల్ల కల్లై అంటూ సగంలో నుంచీ వినరాసాగిన గురజాడ గేయాన్ని వినిపించి 'విశాఖపట్నం' అన్నాడు. 'ఓస్–అంతేనా? వివిధ భారతి ఎక్కడ? ధార్వా రెక్కడ? భువనేశ్వరెక్కడ అంటూ ఎద్దేవా చేయజూచిన ఒక కొంటె కోణంగి వైపు చూస్తూ సర్వ ప్రపంచమూ తన చిన్న పెట్టెలోనే ఉన్నట్టు సగర్వంగా నవ్వేశాడు. 'అలా తీసి పారేయకండి. కావలిస్తే మాస్కో పలికిస్తాను. అమెరికా వినిపిస్తాను." అంటూ సవాలు కూడా చేశాడు.

"ఆంధ్రా బార్డరొచ్చేసిందండీ!" – బస్సు నిలుపుతూ అన్నాడు డ్రయివరు. "చూచారు గదా చౌకుకొయ్య. దేవుడు కనిపించగానే కొబ్బరికాయ కొట్టాలి మరి! ఇదిగో, ఇప్పుడే వస్తాను..." జింకకొదమ చెంగున గెంతినట్టు కిందికి దూకి, చెక్‌పోస్టు వైపు దారి తీశాడు.

రెండు నిమిషాల తతంగం. గంగూలీ తిరిగి రావడమే ఆలస్యం. చెక్‌పోస్టు తాలూకు చౌకు కొయ్యపైకి లేచింది. బస్సు కదిలిందే గానీ మునుపటి వేగం పుంజుకోలేదు. కారణం కొద్ది నిమిషాల్లోనే తెలిసింది.

మళ్ళీ బస్సు కడ్డంగా ఒక చౌకు కొయ్య! "మరైతే తమిళ్‌నాడులోకి వచ్చేశాం గద! రాష్ట్రాలు వేరైనా పద్ధతులొకటే! చెక్‌పోస్టులు, చౌకు కొయ్యలు, మామూళ్ళు" – నవ్వుతూ బస్సు దిగాడు గంగూలీ.

తిరిగి వచ్చాక అడిగాను – "చెక్ పోస్టుల గొడవ ఇంతటితో ఆఖరే గదా?" – అని.

గంగూలీ నా వైపు అయోమయంగా చూచాడు. "ఈ దేశంలో ఎక్కడికి వెళ్ళినా చెక్‌పోస్టులు, చెయ్యి చాచడాలు మిమ్మల్ని వదిలిపెట్టవండి మేష్టారుగారూ!" అన్నాడు.

బస్సిప్పుడు తమిళనాడు నేల పైన పరుగిడుతూంది. కానీ ఆపాటి చిన్న విషయం బస్సనే ఈ బృహ్భదార్థానికి తెలిసినట్టే లేదు. అదింతకు ముందు తెలుగు గడ్డపైన ఎలా పరుగెట్టిందో ఇప్పుడున్నూ అలాగే పరుగెడుతోంది. పోనీ, ప్రయాణీకులైనా అరవగాలి తాకిడికి ఎంతో కొంత ఇబ్బందికి గురి కావాలి గదా? అదేం లేదు. వాళ్ళుగూడా

మునుపటిలాగే నిశ్చింతగా, నిక్షేపంగా ఉండిపోతున్నారు. ఇవి తమిళనాడు గుట్టలు, ఇవి తమిళనాడు చెట్లు, ఇవి తమిళనాడు పొలాలు అన్న ఊహ నా మనసులోనైతే పదిలంగా ఉంది. కానీ ఈ ఆత్మజ్ఞానం వాటికి సుతరామూ ఉన్నట్టు లేదు. అవి బార్డరు కటువైపున 'ఆంధ్రా'లో ఎలా ఉన్నాయో, ఇక్కడా అలాగే ఉన్నాయి.

మార్చి నెల తొలి రోజులు. చలి తగ్గుముఖం పట్టింది. బస్సు ఊయల్లా కదిలిపోతున్న కొద్దీ చల్లటి గాలి జోలపాటలా పనిచేయడం మొదలెట్టింది. బింకానికి పోయి నిద్రపోకుండా ఉండగలనని జయరాంతో అన్నాను. నిద్రపొయ్యేది లేదని పట్టుబట్టి కూర్చున్నాను గూడా! కానీ కనురెప్పల పైన పీఠం పెట్టుకుని కూర్చున్న నిద్రా దేవతదే మాటి మాటికీ పై చెయ్యి కాసాగింది.

నా పరిస్థితిని ఇట్టే కనిపెట్టిన గంగూలీ ఉన్నట్టుండి "మేష్టరు గారూ! మీరొక పని చేస్తారా?" అన్నాడు.

ఉలిక్కిపడి, సర్దుకుని కూచోడానికి ప్రయత్నిస్తూ "ఏమిటి" అన్నాను.

"వెనక్కు వెళ్ళి సంగీత విద్వాన్ గారిని ఇలా పంపించండి! తెల్లవారాక మీ సీటు మీకిచ్చే షరతుపైనే! నేను చెబుతాన్లెండి!"

మహాలింగంగారు గూడా అందుకోసమే వేచి ఉన్నట్టు నా ప్రతిపాదనకు ఒప్పుకున్నారు. ఆపైన కొనసాగిన బస్సు ప్రయాణంలో భాగవతారుగారు వాతాపి గణపతిని గురించి, భద్రాద్రి రామయ్యను గురించి, మధుర మీనాక్షిని గురించి గొంతెత్తి పాడుతున్న కీర్తనల్లో ఏవో కొన్ని పదాలు మాత్రం 'అక్వేరియం'లో గాజు గోడలకు ఒరుసుకోకుండా క్రిందికీ, పైకీ, ప్రక్కలకూ కలయతిరిగే చేప పిల్లల్లా మనసుకు తాకీ తాకకుండా వినిపిస్తూ వచ్చాయి.

బస్సాగి ప్రయాణీకులొకరి పాదాల నొకరు తొక్కేసుకుంటూ లాకులోనుంచీ ఈవలకొచ్చే నీళ్ళలా కిందికి దిగుతున్న సందడిలో హఠాత్తుగా మెలకువ వచ్చింది. వాచీ చూసుకున్నాను. గంట మూడయింది. వాకబు చేయగా తెలిసింది – అదే పన్‌రొట్టి! చుట్టూరా వ్యాపించిన చీకటి నడుమ అది ఒక కరెంటు దీపాలకాంతి వలయం. ఆ వలయంలో, తటాకంలో ఆగిఉన్న వివిధ పరిమాణాల పడవల్లాగా లారీలు, వ్యానులు, టూరిస్టు బస్సులు నిలిచి ఉన్నాయి. సుదీర్ఘ ప్రయాణంలో వాహనాలు చిన్న మజిలీ చేయడానికి అనువైన స్థలంలా ఉంది పన్‌రొట్టి. రోడ్డు కీవలా, ఆవలా కొబ్బరి మట్టల పాకలు, పెంకుటిండ్లు, చిన్న చిన్న మిద్దెలు. దాదాపొక ఫర్లాంగు మేరకు విస్తరించి ఉన్నాయి. వాటిలో ఆల్‌నైట్ హోటల్సే ఎక్కువ. లోపలికి వెళ్ళాల్సిన పనిగూడా లేదు. హాయిగా ఆరు బయట బెంచీలపైన కూచోవచ్చు.

"ఏమండీ, మేష్టారుగారూ! టీ తీసుకుందురు గానీ, రండి!" గంగూలీ పిలిచాడు. దగ్గరికి వెళ్ళకముందే "వాద్దియారుకు ఒరు టీ పోడప్పా" అంటూ ఆర్డరు గూడా ఇచ్చేశాడు.

"అరరే, నీకు బాగా అరవం వచ్చునే" అంటూ ఆశ్చర్యం వెలిబుచ్చాను.

"అదేం మాటండీ, మేష్టారుగారూ! నా మాతృభాష అరవమే! మా అమ్మమ్మది మద్రాసు. కొత్వాలు చావడిలో కూరగాయల కొట్టు. మా నాన్నగారు గూడూరు నుంచి

అరటాకులు, నిమ్మకాయలు లారీపైన తోలుకెళ్ళేవాడు. అప్పట్లోనే మా అమ్మతో పరిచయం. పరిచయం పెళ్ళికి దారితీసింది. లవ్‌మేరేజన్న మాట! పెళ్ళయిన కొత్తలో మా నాన్నగారు తన మకామును గూడూరు నుంచీ బెంగుళూరు మార్చేశారు. నేను పుట్టి ఏడెనిమిదేళ్ళదాకా పెరిగిందక్కడే! మా నాన్నకు అరవం అరకొరగా మాత్రమే వచ్చు. మా అమ్మకు పొట్టపొడిస్తే తెలుగు ముక్క రాదు. వాళ్ళకొక ఒప్పందం కుదిరింది. ఎవరికే భాష వచ్చో అందులో మాట్లాడేదిన్నీ, రెండో వాళ్ళు దాన్ని అర్థం చేసుకునే దిన్నీ! నాకు మా నాన్న గారివల్ల తెలుగు, మా అమ్మవల్ల అరవం, ఇరుగు పొరుగు నేస్తాలవల్ల కన్నడం గూడా - ఏదైనా కొంచెం కొంచెమేలెండి - మాట్లాడ్డానికి అలవాటై పోయింది. మా నాన్నగారు "భోజనమైందా?" అనేవారు. 'ఆచి, ఆచి, ఉక్కారాంగో' అనేది అమ్మ, 'ఎనకిప్పుడే పసి ఇల్లా' అనే వాణ్ణి నేను. మా డైలాగులు భలే రమ్యుగా ఉండేవి లెండి?" పకపకా నవ్వసాగాడు గంగూలీ.

నాకు గంగూలీని కాసేపు ఆటపట్టించాలనిపించింది. "అయినా ఇన్నింటిలోనూ నీకొక్క భాషపైన మాత్రం మక్కువ ఉంటుందిలే, గంగూలీ! నాకు తెలుసు!" అన్నాను.

గంగూలీ నావైపు చిత్రంగా చూస్తూ అన్నాడు - "సార్, సార్! అలా అనుకోవద్దు, ఆ గ్లాసులో ఉన్న దేమిటి? దీన్నింగ్లీషులో 'టీ' అంటారు. హిందీ వాళ్లు 'ఛా' అంటారు. తెనుగులో నైతే తేనీరు. 'తేనీర్' అనేటప్పటికి అరవము. నాకీ పదాల్లో దేనిపైనా మోజులేదు. పదాలవల్ల కడుపు నిండుతుందా, సార్? ఇదిగో, ఇందులో ఉన్నదేదైతే ఉందో, అదంటేనే నా కిష్టం..." ఆప్యాయంగా పానీయం చప్పరించసాగాడు గంగూలీ.

తీవ్రంగా ఒక లెంపకాయ తిన్నట్టయింది నా పని. దేశభాషలందు తెలుగు లెస్స అంటూ బహిరంగ సభల్లో ఎలుగెత్తి చెప్పడానికి వెనకనున్న నా స్వాభిమానం గంగూలీ ముందర చలి జ్వరం వచ్చిన రోగిలా ముడుచుకు పోయింది.

బస్సు బయల్దేరింది. నేను మళ్ళీ నా ఫ్రంటు సీటులోకి తయారయ్యాను. ఉదయం అయిదు గంటలప్పుడు కాలకృత్యాలకని ఆగిన చోట బస్సు దిగి కనిపించినంత దూరం కలయచూచాను. విజయవాడ నుంచీ మచిలీపట్నం వెళ్ళే రోడ్డుపైన నిలబడినట్టే ఉంది. అవే వరి పొలాలు, అవే తాటిచెట్లు, అదే జలసంపద. బహుశా ఇది తంజావూరు జిల్లా అయి ఉండాలి. తమిళనాడులో తంజావూరు మధుర, తిరుచినాపల్లి జిల్లాలు మన సర్కారు జిల్లాల్లా ఉంటాయట. ఉత్తర, దక్షిణ ఆర్కాడు జిల్లాలున్నూ, రాయలసీమ జిల్లాలున్నూ ఒక తానులో ముక్కలేనట! రామనాథపురం జిల్లా మన తెలంగాణాకు డిటోగా ఉంటుందంటారు! అంతెందుకూ, మొన్నటి తుపాను దెబ్బ ఈ తంజావూరు జిల్లాకు గూడా తగిలిందట కదూ! ప్రదేశాలు, పరిసరాలు, సుఖాలూ, భోగాలూ, ఈతి బాధలూ, జీవన పోరాటాలూ - ఎక్కడికీ ఒక్కలాగే ఉంటాయనిపిస్తుంది.

తిరిగొచ్చే సరికి క్లీనరుచేత బస్సు వూడ్పించి శుభ్రం చేయిస్తున్నాడు గంగూలీ.

"మొదట ఇల్లు, తరవాత ఒళ్లు గదండీ, మేష్టరు గారూ! ఇప్పుడు మనకు బస్సే ఇల్లు. అందుచేత దీన్ని వూడ్పించడమైంది. ఇక మన ఒళ్ళు సంగతంటారా? పదిహేను మైళ్ళలోనే తిరునెల్లార్! అక్కడ చెరువంత కోనేరు. నిండుకూ దివ్యంగా నీళ్ళు, పదిబారల

దూరం ఈతగొట్టి ఒకసారి మునిగి లేస్తే బస్సులో వచ్చిన బడలికంతా పటాపంచల్! దుస్తులు మార్చుకుని కొబ్బరిచెట్ల క్రింద నిలబడితే దేవలోకం వెళ్లి నందనవనంలో ఉన్నట్టే! చూద్దురుగానీ, పదండి...”

సంతలో “కాశీపట్నం చూడర బాబూ!” అని పాట పాడుతూ భూతద్దంలో యాత్రా స్థలాలు చూపించే వ్యక్తిని నా చిన్నతనంలో నేను మాంత్రికుడి కింద భావించాను. ఆరోజు గంగూలీ చేసింది అంతకు తక్కువ పనేమీగాదు. అతడు మాకు కోవెలలూ, కోనేర్లూ చూపించాడు. మసీదు చూపించాడు. మాదా గుడి చూపించాడు. నాగపట్నం హార్బరు చూపించాడు. ఒకప్పటి ఫ్రెంచివారి టెరిటరీ చూపించాడు. చిత్రమేమిటంటే, నారదుడికి గోపికల మందిరాల్లో కానవచ్చిన శ్రీకృష్ణుడిలా, ఎక్కడెక్కడ ఏ పని చేయాలో ఆ పని చేస్తూ అతడు కనిపించడం! తిరునెల్లార్ శనేశ్వరుడి గుడిలో నూనె దీపం వెలిగిస్తూ గంగూలీ! వేలాంగణ్ణి ఆరోగ్యమాత చర్చిలో కొవ్వొత్తి వెలిగిస్తూ గంగూలీ! నాగూరు మీరా సాహెబ్ దర్గాలో నెమలి ఈకల పొత్తరతో ఆశీర్వాదం పొందుతూ గంగూలీ!

మధ్యాహ్నం భోజనాలు ముగిశాక బస్సు పూంబు హార్ బయల్దేరింది.

భుక్తాయాసం నిద్రగా పరిణమించే ప్రమాదాన్ని శంకించి నా పక్కన చోటుజేసి మహాలింగం గారిని దాపున కూచోబెట్టుకున్నాను. భాగవతార్ గారి కది పాట లాలపించడానికి అనువైన సమయం గాకపోయింది. అందుకని మెల్లగా మాటల్లోకి రాదీశాను.

“భాగవతార్ గారూ! పూంబుహారంటే ఏమిటండీ?”

మహాలింగం గారి కళ్ళు పెద్దవై పోయాయి. కనుబొమలపైన గుబురుగా పెరిగిన వెంట్రుకలు, నిక్కబొడుచుకున్నాయి. ఉత్సాహాతిరేకంలో ముఖం ఉబ్బిపోయింది. ‘పూంబుహార్, పూంబుహార్’, అంటూ ఒకటికి రెండుసార్లు ఉచ్చరించిన తీరునుబట్టి చూస్తే ఆ పేరు సూచించే ప్రదేశ విశేషానికీ, ఆయనకూ జన్మ జన్మల అనుబంధమేదో ఉన్నట్టు తోచింది.

“కావేరిప్పూం పట్టణం, చోళ మహీ మండలానికి ముఖ్యనగరం. అన్నెక్కావేరీ సముద్ర సంగమమయ్యే తావులో ఉండేది. ‘పుహార్’ అనేది దానికి ముద్దు పేరు. ఓడలపైన వ్యాపారం. ప్రతి ఇంట్లోనూ తాటికాయంత బంగారం. అమ్మో, చెప్పతరమా దాని వైభోగం! అలాంటి కాలంలో మానాయగన్ అని ఒకరు. మా సత్తువాన్ అని ఒకరు. ఇద్దరూ మాలావు డబ్బు గలిగిన ఆసాములే! మా నాయగన్, కూతురు కణ్ణగి, మా సత్తువాన్ కొడుకు కోవలన్. ఇద్దరికీ పెండ్లయింది. మీరు టెలుగూలో చిలకా గోరింక అంటారే - సరిగ్గా, అంత పొరుత్తమాన జోడి! సరే, ఇంతలో మాధవి అనే భోగంపిల్ల ఒకతెవచ్చి పడిందండీ మధ్యలో! కోవలన్ దాన్ని మరిగి పెళ్ళాన్ని మరిచేపోతాడు. ఇండ్లూ వాకీండ్లూ నగలూ భూములూ అన్నీ దానికే దఖలయిపోతాయి! ఏమీలేని బికారివాడైపోతాడు కోవలన్! అప్పుడింక పూలమ్మిన వూళ్ళో కట్టెలమ్ముకోలేక కులపత్ని కణ్ణగిని పిలుచుకొని పాండ్య మండలం వెళ్ళిపోతాడు. పాండ్యరాజు ఒక చెయ్యని నేరంలో ఇరుక్కున్న కోవలన్‌కు

'తూక్కు శిక్ష' విధిస్తాడు. గల్లుకేసేస్తారు. కణ్ణగి రౌద్రకాళి అయిపోతుంది. 'ఎరియట్టుం, మధురానగరి ఎరియట్టుం'- కాలిపోనీ, మధురా నగరం కాలిపోనీ..."

"శాంతం, శాంతం, భాగవతార్‌వాళ్! అవేశపడ్డాదింగో!" అన్నాడు గంగూలీ.

"అదేనయ్యా శిలప్పదికారం!" మహాలింగంగారు కొనసాగిస్తున్నారు. "జైనమా మునివర్ ఇళంగో అడిగళ్ వ్రాసింది. ఇళంగో అంటే ఎవరు? చేరరాజయిన చెంగుట్టవన్ ఎవడైతే ఉన్నాడో ఆయన తమ్ముడు. అది తమిళగంలో జైనమతం జండా ఎగరేసిన కాలం. ఆ తరవాత జైనాన్ని అవతలికి తోసి బౌద్ధం వచ్చేసింది. మీరు బౌద్ధాన్ని గురించి తెలుసుకోవాలంటే 'మణిమేగలై' చదవాలి..."

"మణిమేఖల అనుకుంటాను." క్లారిఫికేషన్‌కోసం అడిగాను.

"అవునదే! మాధవికి కోవలన్‌వల్ల కలిగిన బిడ్డ మణిమేగలై. పిల్ల అపరంజి బొమ్మ. ఎందరో కన్నేస్తారు. ఎవరికీ లోబడదు. సంసారం రోసి బౌద్ధ తురైనిగా మారిపోతుంది. బతికినంత కాలం ఆరామంలోనే ఉండిపోతుంది... అంతెందుకూ, పూంబుహార్ వెళ్తున్నాం గదా? మీరు మాధవినీ, కణ్ణగినీ, కోవలన్‌నీ, ఇళంగో అడగళ్‌నీ, కరికాళచోలుణ్ణి గూడా అక్కడ చూడొచ్చు..."

"ఏమిటండీ మీరనేది? ఏనాటి వ్యక్తులు? ఇంకా జీవించి ఉంటారా?" నిర్ఘాంతపోతూ అడిగాను.

"నిజం మనుషులు కారు. పెద్ద పెద్ద శిల్పా కారాలు. ప్రాణం పోసుకుని మళ్ళీ నిజంగా లేచి వచ్చినట్టే ఉంటారు దూరం నుంచీ చూస్తే."

మహాలింగంగారి ప్రసంగం హఠాత్తుగా ఒక కొలిక్కి రావడానికి కారణం - ఆయన ఆవేశం ఉపశమించడం మాత్రం గాదు. ఉన్నట్టుండి జడివాన ప్రారంభమై పోయింది. ప్రారంభమైన తొలిక్షణంనుంచే అది ఉధృతంగా విరుచుకుపడడం మొదలెట్టింది. వాన జోరూ, గాలి హెూరూగూడా బస్సును ఎడా పెడా వాయించేస్తున్నాయి. కిటికీలోనించి వర్షం వైపు చూస్తూ ఆనందించడం వేరు. శర పరంపరగా కురుస్తున్న వర్ష ధారల్లో నుంచి చొచ్చుకుపోవడం వేరు. చూస్తూ ఉండగానే పొలాలూ, కాలువలూ, చివరకు రోడ్డుగూడా ఒక పెద్ద జలాశయంలో లీనమైన అంతర్భాగాలుగా మారిపోయాయి. బస్సు ఇంచుమించుగా ఒక పడవలా నీటిని కోసుకుంటూ ముందుకు వెళ్తోంది.

"వాన తగ్గేదాకా ఎక్కడైనా ఆగి ఉండగూడదా?" అని గంగూలీని అభ్యర్థించి చూశాను.

"అబ్బే, కుదరదు, సార్! ప్రొద్దుపోయాక పూంబుహార్ వెళ్ళి లాభం లేదు" అన్నాడు.

తిక్కరేగినట్టుగా అలా గంటసేపు కుండపోతగా కురిసిన వాన ఆ తరవాత క్రమక్రమంగా తగ్గిపోసాగింది. నేలా, గాలీగూడా తడిగామారి ఉన్న పరిసరాల గుండా ఇప్పుడు బస్సు పరుగిడుతూంది.

"అదో, అదే పూంబుహార్" అన్నారు మహాలింగంగారు.

ఎంతయినా చెప్పవచ్చు గానీ, సంగ్రహీకరించాలంటే ఆరోజు సాయంకాలం మేము ఒక స్వప్నసీమలో విహరించామని చెబితే చాలు. డిస్నిలాండ్‌ను గురించి వినడమేగానీ

కన్నది లేదు. కావేరీప్పుం పట్టణం కాలగర్భంలో జీర్ణించిపోయిన ఒక చారిత్రక వైభవం. స్మృతి చిహ్న మాత్రంగానైనా సరే, ఆ వైభవాన్ని మళ్ళీ కళ్ళకు గట్టేటట్టుగా నిర్మించగలిగిన శ్రద్ధాభక్తుల్ని అభినందించకుండా ఉండలేము. మహామందిరం ఒక దానిలో రంగు రంగుల చిత్రాలద్వారా వ్యక్తమవుతున్న 'శిలప్పదికార' కావ్యాన్ని తిలకించాము. లతామండపాల్లో రెండు నిలువులెత్తున గంభీరంగా నిలబడి ఉన్న గొప్ప విగ్రహాల ఎదుట నిర్విణ్ణులమై నిలిచిపోయాము. నాట్యశాలలో శిల్పకన్యల సోయగాన్ని చూస్తూ విస్తుపోయాము. విహారసౌధో పరిభాగంలో నిలబడి తరంగఘూర్ణితమై ఒడ్డుకు మోదుకుంటున్న సముద్రాన్ని చూచాము. కంటికెదురైన దృశ్యాలకన్నిటికీ వెనుక ఆ దృశ్యాలకు సంబంధించిన కథలన్నింటికీ వెనుక ఒకానొక మహత్తర సత్యమేదో మనోవీథిలో మెరిసిపోయినట్టు తోచిన అనుభూతిలో శరీరం దూదిపింజలా తేలికబడిపోయింది. మతాలు, రాజకీయాలు, సాంఘికాచారాలు మొదలైనవన్నీ చరిత్రగతిని మార్చి, కడకా చరిత్రలోనే కలిసిపోయిన తరువాత కంచెలు గోడలు, అగాధాలు అంతరాలు సమసిపోయి సుదూర సుందర భవిష్యత్తులో అన్నింటికీ అతీతంగా - చిరంజీవిగా మిగిలిపోయేదేమిటో లీలగా స్ఫురించినట్టయింది...

తడిసిన కాకీ చొక్కాను చెట్టుకొమ్మకు ఆరవేసి బనీనుతో మిగిలిన గంగూలీ మూత తీసి ఇంజన్ను పరిశీలిస్తున్నాడు. అతని పని కద్దు తగలకుండా పది బారల దూరంలో ఉన్న సిమెంటు బెంచీ పైన కూచున్నాను.

పరీక్ష పూర్తికాగానే గంగూలీ తలపైకెత్తాడు. "వచ్చేశారా, మేష్టరుగారూ!" అంటూ నన్ను సమీపించాడు.

ఉదయం తిరునెల్లార్ గుడిలో ముకుదూలంపైన పెట్టుకున్న కుంకుమ చెరిగిపోయినా, ఆ మరక మాత్రం కనిపిస్తూనే ఉంది. వేలాంగణ్ణి చర్చిలో పసుపు దారానికి కట్టి మెడకు తగిలించుకున్న శిలువ బనీను పైనుంచే వ్రేలాడుతోంది. ముంజేతికి నాగూరు మసీదులో కట్టుకున్న నల్లటి దారం......

అతడి వైపు ఎగాదిగా చూస్తూ - "భలే తికమక పెట్టేస్తున్నావయ్యా, గంగూలీ!" అన్నాను.

"ఏ మతమూ నాది కానప్పుడు ఏం చేయాలి, సార్? అన్ని మతాలూ నావేననుకోవాలి. మా అమ్మమ్మ పుట్టుకతో ముస్లిం, పేరు రమీజాబీ. వాళ్ళ నాన్న రైల్వేలో పాయింట్సు మేన్‌గా పనిచేస్తూ ఉండి అర్థాంతరంగా చనిపోయాడు. క్వార్టర్స్‌లో పక్క ఇంట్లోనే ఒక క్రిస్టియన్ ఉద్యోగి ఆమెను చేరదీసి పెళ్ళి చేసుకున్నాడు. ఆ కాపురం ఏడెనిమిదేళ్ళదాకా నెమ్మదిగానే సాగింది. పాత పెళ్ళామంటే ముఖం మొత్తి ఆ పెద్దమనిషి రెండో పెళ్ళి చేసుకోడంతో మా అమ్మమ్మ అయిదేళ్ళ కూతుర్ని వెంట బెట్టుకుని మద్రాసు వెళ్ళిపోయింది. అక్కడ కూరగాయల కొట్టు నడుపుకుంటూ కూతుర్ని పెంచి పెద్ద చేసింది. అప్పటికి మా నాన్న మిలిటరీ సర్వీసునుంచీ డిస్చార్జీ అయివచ్చి గూడూరుకీ మదరాసుకి మధ్య లారీ తోలుతున్నాడు. లారీ వీరప్పంటే ఫేమస్‌లెండి! పేరు కాయన అగ్నికుల క్షత్రియుణ్ణని చెప్పుకోడం! వాడుకలో అది "ముత్తరాసి" కులం. పెళ్ళితో ఆ కులమూ

పోయింది. ఇంకా నయం! నా దాకా వచ్చేటప్పటికి ఏమైందనుకున్నారు? ఒక మతం వాళ్ళు 'మాలో నుంచీ వెళ్ళిపోయినవాడివి. నీతోమాకు సంబంధమేమిటన్నారు. ఇంకో మతం వాళ్ళు 'మొదట మా మతం పుచ్చుకో, ఆ తరవాత చూద్దా" మన్నారు. మరో మతం వాళ్ళు 'నువ్వే కులం నుంచీ కన్వర్ట్ అయ్యావో చెప్పమన్నారు. నాకు చిరాకేసి చక్కా ఒక అనాథ శరణాలయంలోకి వెళ్ళి తల్లిదండ్రులెవరో తెలియని పిల్లను పెళ్ళాడేశాను. చెప్పండి సార్! ఇప్పుడు నాదే మతమవుతుంది?"

ఆనాటి రాత్రి చిదంబరంలో హాల్టు చేశాము. మరునాటి ఉదయం గుడిని దర్శించాము. గుడి అని ఎందుకంటున్నానంటే, చిదంబరం గుడిలో మూలవిరాట్టు లేదు. దేవుడు నిరాకారుడు, నిర్వికారుడు, నిర్గుణుడు అనే సత్యంచుట్టూ ఎంతెంత పెద్ద ప్రాకారాలు, ఎంతలేసి గోపురాలు, ఎన్నెన్ని మండపాలు! బహుశా ఇదే చిదంబర రహస్యమేమో!

మధ్యాహ్నం నైవేలీ లిగ్నయిటు త్రవ్వకాలు చూచాము. తిరుగు ప్రయాణంలో ఒక చోట జీడిమామిడి తోటల గుండా వెళ్తున్న ఒక ఏరు బస్సు కెదురైంది. స్వచ్ఛమైన నీటిలో స్నానం చేయాలని కొందరు, చల్లటి ఇసుక తిన్నెలపైన విశ్రమించాలని కొందరు – ప్రయాణీకులక్కడ చిన్నటెంకీ వేసేశారు. ఆ వ్యవధిలో క్రితంరోజు కురిసిన జడివాన తాకిడికి బురద గొట్టుకుపోయిన బస్సును కడిగే పనిలో నిమగ్నుడైపోయాడు గంగూలీ. క్లీనరు కుర్రాడు బకెట్తో నీళ్ళు తీసుకొచ్చి ఇస్తుంటే, అతడు బురద దాగులన్నింటినీ రుద్ది రుద్ది కడుగుతున్నాడు...

బస్సు ప్రయాణాల్లో గంగూలీ కంటిపైన రెప్ప వేయడానికి వీలుండదు. ఆదమరపు అసలే పనికిరాదు. ఎండలు మండిపోతున్నా ఇంజను వేడికి తట్టుకోక తప్పదు. విశ్రాంతి అతడికి అరుదుగా మాత్రమే దొరికే వస్తువు. దారి పొడుగునా ప్రయాణీకుల సందేహాలన్నింటికీ సదుత్తరాలు చెప్పాలి. వాళ్ళాగమంటే ఆగాలి. సర్లే, వెళ్ళమంటే ముందుకు సాగాలి. ఇంత చాకిరీ చేసినందుకు నెల జీతం ఏ రెండు వందలో, మూడు వందలో అతనికి గిట్టుబాటు. లేదంటే బస్సెక్కిన రోజున అయిదో పదో బత్తా కింద ముట్టవచ్చు. మిగిలిన ఆదాయమంతా కామందు మూలనిధి ఖాతాకే గదా జమయ్యేది? కార్మికుడి శ్రమపైన నిరంతరంగా జరుగుతున్న ఈ దోపిడి – ఇదే గదా పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రాణం?

నా ఆవేదనను ఇంచుమించుగా అదే మాటలతో గంగూలీ దగ్గర వెలిబుచ్చాను. అతడు నవ్వేశాడు. నవ్వుతూ, నవ్వుతూ అన్నాడు!

"ఈ బస్సు నాదేనండీ... నేనే ఓనర్ని"

♦ 'ఆంధ్రప్రభ' వార పత్రిక – *1978* ♦